ప్రజాశక్తి
www.prajasakti.com
గురువారం 26 సెప్టెంబర్ 2024



10 వేల పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 27న గండికోటలో భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ 'మన గండికోట' పేరిట రూపొందించిన 10 వేల పుస్తకాలను పంపిణీ చేయనుంది. ఈ సంవత్సరం పర్యాటక దినోత్సవాన్ని కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో గండికోటలో నిర్వహించనున్నారు. ఇంటాక్ సంస్థ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఈ ఉత్సవానికి హాజరుకానున్న ప్రజలకు గండికోట గురించి క్షుణ్ణంగా సమాచారం అందించేందుకు 34 పేజీల మినీ పాకెట్ బుక్లెట్ను రూపొందించారు. 18 ఫోటోలున్న ఈ పుస్తకంలో గండికోటలోని అన్ని ప్రముఖ ప్రాంతాల గురించి, చారిత్రక నిర్మాణాల గురించి ప్రాథమిక సమాచారం అందజేసే వివరాలున్నాయి. ఈ పుస్తకాన్ని పూర్తిగా చదివితే గండికోట గురించి ఓ మోస్తరు అవగాహన కలిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎన్డిఎ నెత్తిన 'కొప్పర్తి' కొరివి

- రూ.250 కోట్ల ఎంఎస్ఎంఇని తరలిస్తూ జిఒ
- అక్రమ తరలింపుపై సర్వత్రా నిరసనాగ్రహం
- కోటిరెడ్డి సర్కిల్లో జిఒ ప్రతులు దహనం
- పార్టీలకు అతీతంగా నిరసనలు



జిఒ 56 ప్రతులను దహనం చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/కడప అర్బన్

రాష్ట్రంలోని ఎన్డిఎ సర్కారు కొప్పర్తి మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్ టెక్నాలజీ, టెస్టింగ్ సెంటర్ (ఎంఎస్ఎంఇ) తరలింపు కొరివిని కోరి నెత్తిన పెట్టుకుంది. కొప్పర్తి పారిశ్రామికవాడ నుంచి ఎంఎస్ఎంఇని రాజధాని కేంద్రమైన మంగళగిరిలోని సిఆర్డిఎకు తరలించాలని పేర్కొంటూ మంగళవారం జిఒ నెంబర్ 56 జారీ చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా జిల్లాలోని రాజకీయ పార్టీలకతీతంగా ఆందోళనలు, నిరసనలు మిన్నంటుతుండడం ఆందోళన కలిగిస్తోంది. వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం కడప నగరంలోని కోటిరెడ్డిసర్కిల్లో జిఒ ప్రతులను దహనం చేయడం మొదలుకుని ప్రెస్మీట్లు నిర్వహించడంతో కూడిన నిరసన జ్వాలలు మిన్నంటాయి. వైసిపి ప్రభుత్వ హయాంలో కేంద్రం కడప, విశాఖపట్నం జిల్లాలకు ఎంఎస్ఎంఇలను మంజూరు చేసిన సంగతి తెలిసిందే. కొప్పర్తి పారిశ్రామికవాడకు రూ.250 కోట్లతో కూడిన ఎంఎస్ఎంఇని మంజూరు చేసింది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డిఎ కూటమి అధికారం చేపట్టడంతో కొప్పర్తి ఎంఎస్ఎంఇ తరలింపు గ్రహణం పట్టుకుంది. రాష్ట్రంలో వెనుకబడిన కడప జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ యువతలో స్కిల్ నైపుణ్యాలను కాలరాయడంపై పెద్దఎత్తున విమర్శలవర్షం కురుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనగానే కడప జిల్లా పట్ల వివక్ష చూపుతారనే విమర్శ ఏళ్ల తరబడి నెలకొని ఉంది. తాజాగా ఎంఎస్ఎంఇ తరలింపు జిఒ జారీ ఘటనతో ఆరోపణలను నిజమని నిరూపించుకున్నారనే వాదన వినిపిస్తోంది. ముఖ్య మంత్రిగా చంద్రబాబు నాయుడు వ్యవహరించిన హయాంలో కొప్పర్తిలో ఏర్పాటు చేయడానికి ముందు కొచ్చిన మల్టీప్రొడక్ట్ కాంప్లెక్స్, అడిదాస్ బూట్ల కంపెనీ, డిఆర్డిఒ, తదితర ఎనిమిది కంపెనీలు మొగ్గు చూపించడం తెలిసిందే. అప్పటి టిడిపి సర్కారు ఆమోదం లభించకపోవడంతో తరలిపోయిన అంశాల్ని పలు వురు మేధావులు, నాయకులు నెమరు వేసుకుంటున్న దృశ్యాలు కనిపించడం గమనార్హం. హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రభుత్వాన్ని తరలించిన సందర్భంగా నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి హోదాలో చంద్ర బాబు ఎంతో ఆర్భాటంగా జిల్లాల వారీగా అభివృద్ధి ఆశలు కల్పించిన సంగతి తెలిసిందే. రాయలసీమ జిల్లాలకు కేంద్రం కేటాయించిన ఎయిమ్స్, ఐఐటి వంటి జాతీయ స్థాయి సంస్థలతోపాటు ఎంఎస్ఎంఇ వంటి పలు కేంద్రాల తరలింపులతో ఆశలకు సమాధి కట్టినట్లు అవుతోందనే వాదన వినిపిస్తోంది.

జిఒ 56 రద్దు చేసే వరకు పోరాటం : సిపిఐ

వివిధ రంగాలలో శిక్షణ, నైపుణ్యం, మార్కెటింగ్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక కేంద్రంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల సాంకేతిక కేంద్రం (ఎంఎస్ఎంఇ టెక్నాలజీ సెంటర్) చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సిఆర్డిఎకు తరలిస్తూ జారీ చేసిన జిఒ నెంబర్ 56ను తక్షణ ఉపసంహరించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు. కోటిరెడ్డి సర్కిల్లో జిఒ ప్రతుల దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొప్పర్తి పారిశ్రామికవాడలో రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 19.5 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన్నారు. సంస్థ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాటు, నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందని, అలాంటి సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడప జిల్లాపై కక్ష సాధింపుతో సిఆర్డిఎకు తరలిస్తూ జిఒ తీసుకురావడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో రాష్ట్ర పారిశ్రామిక కారిడారుకు కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాన్ని అనుసంధానిస్తూ నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటన జిల్లా ప్రజానీకానికి చిగురించిన ఆశలు జిఒ 56తో ఆవిరి అయిపోయాయన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి ఎన్.వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్ జి.వేణు గోపాల్, జిల్లా సమితి సభ్యులు కె.మునయ్య, పి.మల్లికార్జున, దస్తగిరి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఇని తరలించవద్దు : సిపిఎం

జగన్పై కోపంతో కడపను శపిస్తున్న బాబు వైఖరి క్షమించరానిదని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ అన్నారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప జిల్లా కొప్పర్తి ఎంఎస్ఎంఇని కేంద్ర ప్రభుత్వం ఇస్తే దానిని రాష్ట్ర ప్రభుత్వం క్యాపిటల్ డెవలప్మెంట్ అథారిటీ అమరావతికి తరలించడం దుర్మార్గమని చెప్పారు. వైఎస్.రాజశేఖర్రెడ్డి సిఎంగా ఉన్నప్పుడు రాయలసీమ కేంద్రమైన కడప జిల్లాలో ఉపాధి అవకాశాల కోసం కొప్పర్తి మేఘ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రయత్నించారని తెలిపారు. ఆ తర్వాత కొప్పర్తి హబ్ ఏర్పడిందని, కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి ఇండస్ట్రియల్ హబ్బును అభివృద్ధి చేస్తామని 2024-25 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సమావేశాల్లో కూడా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావన చేశారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎంఎస్ఎంఇని చంద్రబాబు నాయుడు రాయలసీమ వాసైనా సిఎంగా ఈ ప్రాంత నిరుద్యోగ విద్యావంతులైన యువతి, యువకులకు 17 రంగాల్లో ఉచిత స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ ఇవ్వటానికి కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన దానిని అమరావతికి తీసుకెళ్లడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అవసరమైతే అమరావతిలో మరో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. వైఎస్ కుటుంబంపై ఉన్న ద్వేషంతో కడప జిల్లాకు, ఈ ప్రాంత ప్రజలకు, రాయలసీమ కరువు పీడిత ప్రాంత నిరుద్యోగులకు అన్యాయం తీవ్రంగా చేయడమేనని విమర్శించారు. తక్షణం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

అంచెలంచెలుగా అభివృద్ధి : మంత్రి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రభుత్వం అంచెలంచెలుగా అభివృద్ధి కార్యక్రమాలను సంతృప్తికర స్థాయిలో పూర్తి చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి తెలిపారు. బుధవారం కడప జిల్లా పరిషత్ ప్రాంగణంలో రూ.454.50 లక్షల జడ్పి నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ను మంత్రి రాంప్రసాద్రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే పెన్షన్ల పెంపుదల, డిఎస్సీ ఉద్యోగాల నోటిఫికేషన్ల మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం, రానున్న దీపావళి పండుగకు అర్హులైన ప్రతి కుటుంబంలో మహిళలల పేరుమీద మూడు గ్యాస్ సిలిండర్లను అందివ్వనున్నట్లు తెలిపారు. స్వర్ణ ఆంధ్రప్రదేశ్ -2047 లక్ష్య సాధనలో భాగంగా రానున్న ఐదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగల్ల్ పురోభివృద్ధి వైపు నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించి ముందడుగు వేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అతి త్వరలోనే మహిళామూర్తులకు ఒక శుభవార్త చెబుతామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి, జడ్పి చైర్పర్సన్ శారదా, కడప, కమలాపురం, రాజంపేట ఎమ్మెల్యేలు రెడ్డెప్పగారి మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, ఆకేపాటి అమర్నాథ్రెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి సుధాకర్రెడ్డి, టిడిపి పొలిట్బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, స్థానిక నాయకులు, పలువురు జిల్లా అధికారులు, పలువురు జడ్పిటిసిలు, జడ్పి సిబ్బంది పాల్గొన్నారు.



జడ్పి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్రెడ్డి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : కాంగ్రెస్



పల్లాలు, గరిటలతో శబ్దం చేస్తూ నిరసన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప

సూపర్ సిక్స్ పథకాల హామీల అమలులో చంద్రబాబు ప్రభుత్వం సూపర్ ఫ్లాప్ అయిందని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం పరిస్థితి పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్లయిందని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ధ్వజమెత్తారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు పల్లాలు, గరిటలతో శబ్దం చేస్తూ థాలీభజావో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం పాలనలో అప్పులు ఫుల్, అభివృద్ధి నిల్, సంక్షోభంలో సంక్షేమం అన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని మాఫియా రాజ్యం చేసిందన్నారు. రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, అవినీతి, మద్య, జూద, డ్రగ్, గంజాయి ఆంధ్రప్రదేశ్గా మార్చిందన్నారు. అందువల్లనే గత ఎన్నికల్లో వైసిపిని ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించారని పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే జగన్ ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. యువతకు సంబంధించి నిరుద్యోగ భృతి హామీ, విద్యార్థులకు సంబంధించి తల్లికి వందనం, రైతులకు సంబంధించి అన్నదాత సుఖీభవ, మహిళలకు సంబంధించి ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, 19 నుంచి 59 సంవత్సరాల మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, బిసి, ఎస్సి, ఎస్టి, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛను హామీలు అమలు చేయలేదన్నారు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు టిడిపి కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల వల్ల టిడిపి కూటమి ఘన విజయం సాధించిందన్నారు. అధికారంలోకి వచ్చి 103 రోజులు అయినప్పటికీ సామాజిక ఫించన్ల పెంపు తప్ప మిగతా 5 హామీలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో కడప నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బండి సుమంత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండి జకరయ్య, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలా ఉద్దీన్, వెన్నపూస మధురెడ్డి, మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి, పాముల బ్రహ్మానంద రెడ్డి, ఇర్ఫాన్, చెప్పలి పుల్లయ్య, శ్యామలమ్మ, వెంకటరమణ, మల్లెల విజయ భాస్కర్, సుశీల్ కుమార్, హరిప్రసాద్, కదిరిప్రసాద్ గౌడ్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు నియోజకవర్గ యువజన అధ్యక్షులు మెరువ వంశీ యాదవ్, గంధం సునీల్ కుమార్, అన్వర్, మధుసూదన్రెడ్డి, సుధాకర్ రెడ్డి, హమీద్, కమల్, రహమ్మతుల్లా ఖాన్, నసీర్, అబిద్, బాబ్జీ, గంగయ్య, సుబ్బారెడ్డి, హబీబుల్ల, అరుణ్ కుమార్, విక్కీ, సంజయ్ కాంత, ఉత్తన్న, మాష్, నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.

సుందర నగరంగా తీర్చిదిద్దాలి : కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి కడప అర్బన్

కడప నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్గా తీర్చిదిద్దాలని కలెక్టర్ శివశంకర్, కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. బుధవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక రాయచోటి ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ దేశానికి అత్యంత అవసరమైనది స్వచ్ఛభారత్ అన్నారు. టిడిపి పోలిట్బ్యూరో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాలు నగరాలు స్వచ్ఛంగా ఉండాలని తెలిపారు. తొలుత ర్యాలీ రాయచోటి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నుంచి ఊటుకూరు మీదుగా పులివెందల రింగ్ రోడ్డు వరకు కొనసాగి ముగిసింది. అనంతరం కడప కన్వెన్షన్ హాల్ వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఒ.నందన్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, డిఎస్డిఒ జగన్నాథరెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, నగరపాలక సంస్థ సిబ్బంది, నేతలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే మాధవి



చెకుముకి పరీక్షను పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి

ప్రజాశక్తికలసపాడు

పాఠశాల స్థాయిలో విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సెయింట్ ఆంటోనీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిత్తా ప్రభావతి అన్నారు. బుధవారం విద్యార్థులకు చెకుముకి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యపుస్తకాల మీదనే కాకుండా జనరల్ నాలెడ్జ్ మీద కూడా అవగాహన కలిగే విధంగా ఇలాంటి పోటీతత్వ పరీక్షలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. గణితం, సైన్స్, ఇంకా అనేక అంశాల పైన సరికొత్త నూతన పద్ధతిలో ఇచ్చే ప్రశ్నలకు వారు అవగాహన చేసుకుని చక్కని క్రమంలో సరైన జవాబులను గుర్తించి వారి మనోవిజ్ఞానాన్ని వికసింప చేసేందుకే ఈ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల జన విజ్ఞానిక వేదిక సెక్రెటరీ జి.గురయ్య, సైన్స్ ఉపాధ్యాయులు రమణాచారి, శ్రీనివాసులు, కృష్ణవేణి పాల్గొన్నారు.

జీవకోటి మనుగడకు నీరే ఆధారం

ప్రజాశక్తి - కడప

భూమిపై సమస్త జీవకోటి మనుగడకు మీరే ఆధారమని ఎన్సిసి అధికారి డాక్టర్ నీలయ్య, ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. బుధవారం కడప నగరంలోని ఫాతిమా కాలేజ్ దగ్గర గల కెసి కెనాల్లో ఎన్సిసి క్యాడెట్లచే పునీత్ సాగర్ అభయాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీలయ్య మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న చెరువులు, కాలువలు, నది జలాలలో నీరు కలుషితం కావడం వల్ల మనుషులు, జంతువులు అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. కలుషితమైన నీటిని వ్యవసాయానికి వినియోగించడం వలన ఆహార పంటలు కూడా కలుషితం అవుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా ప్లాస్టిక్ వ్యర్థాలను, నిరుప యోగ వస్తువులను నీటిలో వేసి కలుషితం చేయకుండా, వాటి ప్రవాహాలకు ఎటువంటి అడ్డంకి లేకుండా చూడాలన్నారు. కళాశాల ఎన్సిసి క్యాడెట్లచే కెసి కెనాల్ పరిసరాలను పరిశుభ్రపరచడంతో పాటు నీటిలో పారవేసిన చెత్త చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను, ఇటీవల నిమజ్జనం చేసిన వినాయక విగ్రహ శకలాలను తొలగించారు. కార్యక్రమంలోఎన్సిసి అధికారి లెఫ్టినెంట్ మహేష్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, డాక్టర్ ఎం.వి.సురేష్ బాబు, క్యాడెట్లు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్సిసి క్యాడెట్లు

పర్యాటకాభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రతి ఒక్కరూ పర్యాటకాభివృద్ధికి కృషి చేయాలని, పర్యాటకం పట్ల స్పృహ మనతోనే ప్రారంభం కావాల్సిన అవసరం ఉందని ఎస్సీ కార్పొరేషన్ ఇడి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల ఫోటోల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన చుట్టుప్రక్కల గల పర్యాటక ప్రాంతాలను దర్శించేందుకు మనం తొలి ప్రాధాన్యతనివ్వాలని, ఆ తర్వాత జిల్లాలోని ఇతర ప్రాంతాలను సందర్శించి, జ్ఞానాన్ని, సంప్రదాయాలను, సంస్కృతిని, వారసత్వాన్ని, సమాజంలో శాంతిని పెంపొందించే విధంగా ఉండాలన్నారు. పర్యాటక అంశంలో జిల్లా గండికోటతో ప్రపంచ స్థాయిలో సగర్వంగా నిలబడగల్గిందన్నారు. చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ పర్యాటకపరంగా కలెక్టర్ శివశంకర్ ద్వారా గండికోటలో అవసరమ్మెన వసతులు చేకూరుతున్నాయని పేర్కొన్నారు. ఈ కోటకు యునెస్కో గుర్తింపు పట్ల ఆశలు పెరుగుతున్నాయన్నారు. యువత పర్యాటకరంగ అభివృద్ధికి కృషిచేయాల్సిన అవసరం గురించి పలు సూచనలు చేశారు. సంస్థ ప్యాట్రన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ కుటుంబాలతో సహ సమీప పర్యాటక ప్రాంతాలను సందర్శించడం అలవాటు చేసుకోవాలన్న కలెక్టర్ సూచనను తప్పక గుర్తుంచుకోవాలన్నారు. పర్యాటక అభిమానులు గొబ్బూరి కోటేశ్వరరావు, శ్రీనివాసులు, రామలింగారెడ్డి, డేవిడ్, విజయ్ కుమార్ బాబు పాల్గొన్నారు.

'ఆర్థికాభివృద్ధికి సహకరించండి'

ప్రజాశక్తి-కడప అర్బన్

స్వర్ణాంధ్ర-2047 విజన్లో ప్రజలందరూ భాగస్వామ్యులై అమూల్యమైన అభిప్రాయాలను తెలపాలని కలెక్టర్ శివ శంకర్ పేర్కొన్నారు. బుధవారం ఉక్కాయపల్లెలో వార్డు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ జిల్లా, రాష్ట్రం, దేశం గురించి ఆలోచించి ఆర్థిక అభివృద్ధికి అమూల్యమైన సలహాలు, సూచనలు, క్యూఆర్ కోడ్ ద్వారా తెలపాలని సూచించారు. జిల్లా, రాష్ట్రం సుస్థిరాభివృద్ధి సాధించి దేశంలోనే ముందంజలో నిలపాలన్న ముఖ్యమంత్రి కళకు ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలన్నారు. నగరంలో వాగులు, వంకలు, చెరువులు డ్రెయినేజీలపై ఎవరైనా అక్రమ కట్టడాలు నిర్మిస్తే వాటిని వెంటనే తొలగిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుం టామన్నారు. హౌసింగ్ పథకం కొనసాగుతుందని అయితే మార్చి 2025 ఆరు నెలల లోపు ప్రతి ఒక్కరు స్థలం పొందిన వారు గృహాన్ని ఇంటిని నిర్మించుకోవాలని కోరారు. నగర ప్రజలు తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు. దీంతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు తెలిపారు. టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 40 డివిజన్లో డ్రైన్స్ సరిగా లేవని అందుకు రూ.20 లక్షలు మంజూరు చేయాలని కలెక్టర్ను కోరగా 15 రోజుల్లో పనులు చేపట్టి త్వరగా పూర్తి చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల మేరకు ప్రతి ఒకటి అమలు చేసుకుంటూ వస్తున్నారన్నారు. అనంతరం ఆదరణ కింద మంజూరైన కుట్టు మిషన్లను, సిల్క్ మిషనరీ యంత్రాలను, గార్బేజ్ ఆటోలను, బైండింగ్ మిషన్లను పరిశీలించారు. గాంధీ జయంతి రోజున అందరికీ అందజేసే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, అడిషనల్ కమిషనర్ రాకేష్, సచివాలయ, కార్పొరేషన్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉపాధ్యాయురాలిని సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-బద్వేలు : పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 7వ తరగతి విద్యార్థిని మహిమను వసంతరాణి అనే ఉపాధ్యాయురాలు ఇష్టానుసారంగా కొట్టడంతో విద్యార్థిని కడప రిమ్స్లో నాలుగు రోజుల నుంచి చికిత్స పొందుతున్నా ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోక పోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని, కనీసం జిల్లా ఉన్నత అధికారులు పరామర్శించలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. బుధవారం బద్వేల్ ఆర్డిఒ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేరే తరగతి గదిలోంచి వచ్చిన ఓ విద్యార్థికి అవసరమైన సామగ్రి వస్తువులు అడుగగా నా దగ్గర లేవని చెప్పడం జరిగిందని, అదే తరగతిలో ఉన్న ఉపాధ్యాయురాలు చూసి నాకు చెప్పకుండా మీ ఇద్దరూ ఎలా మాట్లాడతావా అంటూ మహిమ అనే విద్యార్థిని వీపు భాగం పైన వంచి కొట్టారని, కొట్టడంతో గుండె ఊపిరి ఎక్కువగా కొట్టుకోవడంతో హార్ట్ స్ట్రోక్ వచ్చేంత స్థితికి దారికి తీసిందని పేర్కొన్నారు. డిఇఒ ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్నారు. విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకొని విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి అంజి, ఎస్ఎఫ్ఐ నాయకులు బన్నీ, సిద్దు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యం : విసి

ప్రజాశక్తి-కడప అర్బన్ : నూనె రహిత సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా జీవన ప్రమాణ రేటును పెంచుకోవచ్చని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, రీపర్పస్ యూజ్డ్ కుకింగ్ ఆయిల్ స్టార్ గ్లోబల్ ఏజెన్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో 'వంట నూనెను తిరిగి వాడటం మానుకోండి- మీ తలరాతను కాపాడుకోండి'పై అవగాహన కార్యక్రమం ఇన్ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతకాలపు ఆహారపు అలవాట్లైనా సజ్జలు రాగులు, కొర్రలు, ఆకుకూరలు తినే ఆహారంలో ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంటాక్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, కడప హోటల్స్ అసోసియేషన్స్ అధ్యక్షులు రషీద్ఖాన్, డాక్టర్ వి.రామకృష్ణ, డాక్టర్ టి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కడప అర్బన్

ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా కడప నగరానికి నీటి సరఫరా చేసే హెడ్ వాటర్ వర్క్స్ వద్ద పలు ఎలక్ట్రికల్ వైర్లు తెగిపోవడంతో మరమ్మతులు చేస్తూ ఉన్నారని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలో సుమారు 24 గంటల పాటు నీటి సరఫరాలో అంతరాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు. వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైన వారు 9949093772 నంబర్ను సంప్రదించగలని తెలిపారు. అసౌకర్యానికి చింతిస్తున్నామని పేర్కొన్నారు.

'అన్నదాత సుఖీభవ'ను అమలు చేయండి

- డిఆర్ఒకు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి-కడప అర్బన్

అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, రైతు స్వరాజ్య వేదిక జిల్లా కన్వీనర్ పి.శివారెడ్డి అన్నారు. బుధవారం ఎపి రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలలో జమ చేయాలని కోరుతూ డిఆర్ఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 ఖరీఫ్ పంటల బీమా పరిహారం రైతులకు ఇవ్వాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే జిఒ నంబరు 22 రద్దు చేయాలని, భూ యజమానుల సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు దారులకు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టిస్తున్నారని యూరియా, డిఎపి ఎరువులు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని కోరారు. జిల్లాల పెండింగ్లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పంట కాలువలు పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని డిఆర్ఒ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పులివెందుల పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ.. మారుతున్న వాతావరణం కనుగుణంగా చుట్టుపక్కల ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటికి వచ్చే చెత్త బండికి వ్యర్థాలను ఇవ్వాలన్నారు. ఎక్కడపడితే అక్కడ వేయకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతా హీ సేవా-2024 కార్యక్రమానికి సహకరించి క్లీన్ మున్సిపాలిటీగా ఉంచడానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు, మున్సిపల్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్‌డిఒ, కమిషనర్

మైదుకూరు(చాపాడు) : పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని కస్తూరిబా బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ విజయ తెలిపారు. బుధవారం నెహ్రూ యువ కేంద్రం, అమ్మ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాలను శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, విద్యార్థులచే స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ ఖాజా హుస్సేన్, విశ్రాంత ఉపాధ్యాయులు చలమయ్య, అమ్మ సేవా సమితి అధ్యక్షులు వాగ్దాడం శివశంకర్, నెహ్రూ కేంద్ర వాలంటరీ వీరనరేష్, మహబూబ్ బీ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా మహబూబ్ బాషా

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట తహశీల్దార్‌గా మహబూబ్ బాషా నియమితులయ్యారు. ఇక్కడ పని చేస్తున్న సరస్వతిని ముద్దనూరుకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో కలసపాడు తహశీల్దార్ మహబూబ్ బాషా ఖాజీపేటకు రానున్నారు.

ఆయాపై రాజకీయ కక్ష సాధింపు

- న్యాయం చేయాలని బాధితురాలు రుక్మిణి వేడుకోలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని గుంత చియ్యపాడు ప్రాథమిక పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న గొగ్గి రుక్మిణిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు చేపట్టారు. కొన్నేళ్లుగా ఆమె పాఠశాలలో ఆయాగా కసువు ఊడ్చడం, మరుగుదొడ్లు కడడడం వంటి పనులు చేస్తూ ప్రభుత్వం వారు మంజూరు చేస్తున్న వేతనంతో జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో స్థానిక నాయకుల నుంచి ఒత్తిడి ప్రారంభమైంది. వెంటనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని, లేదంటే తొలగించి తమ పార్టీ వారిని ఆయాగా నియమిస్తామని బెదిరిస్తున్నారని బాధితురాలు రుక్మిణి వాపోతోంది. బుధవారం పాఠశాలలో విధులు నిర్వర్తించేందుకు వెళ్లగా ఇతరులు ఆ పని చేస్తున్నారని.. అధికారులు తనకు తగు న్యాయం చేయాలని బాధితురాలు వేడుకొంటోంది. ఆయా భర్త రామసుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన తమకు జిల్లా అధికారులు న్యాయం చేయాలని కోరారు.

అన్న క్యాంటీన్‌లో శుభ్రత పాటించాలి

- మున్సిపల్ కమిషనర్ రాముడు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

అన్న క్యాంటీన్‌లో శుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను బుధవారం ఉదయం ఆయన పరిశీలించారు. ఆహార పదార్థాలను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్లను మళ్లీ ప్రారంభించారని, వీటిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్ నిర్వాహకులతో మాట్లాడుతూ క్యాంటీన్‌లో శుభ్రత పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందివ్వాలని సూచించారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల గ్రామం శ్రీరాములపేటకు చెందిన రాజగోపాల్ రెడ్డి (35) అనే వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎర్రగుంట్ల స్టేషన్ పట్టాలపై బుధవారం గుర్తు తెలియని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. హెడ్ కానిస్టేబుల్ నాగాంజనేయులు, కానిస్టేబుల్ ఫిరోజ్ సంఘటన స్థలంలో విచా రించారు. అక్కడ దొరికిన వివరాల మేరకు మృతుడు స్థానిక శ్రీరాములపేటకు చెం దిన రాజ గోపాల్‌రెడ్డిగా గుర్తించి, కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మృ తుడు ఒక ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడని పోలీసులు తెలిపారు.


రాజగోపాల్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

గుర్తుతెలియని మరో వ్యక్తి మృతి



ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు-ఎర్రగుంట్ల రైలు మార్గంలోని రైలు పట్టాలపై బుధవారం 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారామిరెడ్డి తెలిపారు. రైలు నుండి ప్రమాదవశాత్తూ జారి కింద పడి మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడ్ని గుర్తిస్తే ఎర్రగుంట్ల రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

వ్యక్తిపై రాడ్లతో దాడి : తీవ్రగాయాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని రాజారెడ్డి కాలనీ సమీపంలో చాగలేరు గ్రామానికి చెందిన రామాంజనేయులు అనే వ్యక్తిపై సందీప్, శివ నాగేంద్ర రాడ్లతో దాడి చేశారు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. బుధవారం రామాంజనేయ వ్యక్తికి రాజారెడ్డి కాలనీ సమీపంలో ఉంటున్న లక్ష్మీతో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో లక్ష్మీ కొడుకులు సందీప్, శివ నాగేంద్ర రామాంజనేయులుతో ఘర్షణ పడ్డారు. అక్కడే రాడ్లు తీసుకుని రామాంజనేయులు తలపై బలంగా కొట్టడంతో రామాంజనేయులు రక్తగాయాలతో రోడ్డుపై పడిపోయాడు. వెంటనే స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు పంపారు. సంఘటన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించారు.

జంతు మాంసం పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఎగువ తూపల్లె గ్రామంలో నాలుగు కిలోల జంతు మాంసం పట్టుకున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి బాల సుబ్రమణ్యం తెలిపారు. సమాచారం మేరకు ఫారెస్ట్ సిబ్బంది దాడులు చేశారన్నారు. ఎగువ తూపల్లె గ్రామానికి గొందిపల్లె వెంకటపతి, గొందిపల్లె నడిపి మునెయ్య, తాళ్ళపల్లె మునెయ్య అడవి జంతు మాంసాన్ని వండేందుకు సిద్ధంగా ఉండగా సిబ్బంది స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఎక్కడిదని ప్రశ్నించగా చిలేకాంపల్లె సిద్దారెడ్డి అనే రైతు తన పొలానికి విద్యుత్ తీగలు లాగడంతో కరెంటు షాక్‌తో మృతి చెందిందని చెప్పారన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - కాశినాయన

మండల కేంద్రమైన నరసాపురం నుంచి పుష్పల మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన పొన్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మద్యం బాటిళ్లు తీసుకొని పోతుండగా మార్గమధ్యలో అరెస్టు చేశామని ఎస్ఐ హనుమంతు తెలిపారు. వెంకటేశ్వర్లు ఇక్కడి నుంచి మద్యం తీసుకెళ్లి వారి ప్రాంతంలో అమ్ముతున్నట్లు తెలిసిందన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు, వంకలు

చాపాడులో 44.6 మి.మీ. వర్షపాతం నమోదు - వంద ఎకరాల్లో నీటమునిగిన వరి పంట


గుంత చియ్యపాడు వద్ద లో లెవెల్ బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వర్షం నీరు

ప్రజాశక్తి - చాపాడు

బుధవారం తెల్లవారుజాము నుంచి మండల పరిధిలో భారీగా పడిన వర్షం వల్ల మండల పరిధిలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండల పరిధిలో 44.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు, పంట పొలాలలో ఎక్కడ చూసినా వర్షపు నీరు నిండుగా ఉంది. గత పది రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండి ఉక్కపోత కూడా ప్రారంభమైంది. బుధవారం పడిన అధిక వర్షానికి వాతావరణం పూర్తిగా చల్లబడింది. సోమాపురం, బద్రిపల్లె, గుంత చియ్యపాడు, రాజువారిపేట, అనంతపురం గ్రామాల వద్ద వంకలు అధికంగా ప్రవహిస్తున్నాయి. సిద్దారెడ్డిపల్లెలో ప్రధాన రహదారిపై అధికంగా నీరు నిలిచింది. గుంత చియ్యపాడు నుంచి చాపాడుకు వచ్చే మార్గంలో వంకలో అధిక నీటితో లో లెవెల్ బ్రిడ్జి నీట మునిగింది. చాపాడు-నక్కలదిన్నె మార్గాన ఉన్న గుండ్ల వంక కూడా ఉధృతంగా ప్రవహించడంతో లో లెవెల్ బ్రిడ్జిపై నీరు పారుతోంది. మండల వ్యాప్తంగా 100 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగింది.


సిద్దారెడ్డిపల్లె వద్ద నీట మునిగిన వరి పంట

హమాలీ కార్మికుల కూలి పెంచాలి



రేషన్ గోడౌన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీ కార్మికులు

ప్రజాశక్తి - వేంపల్లె

తమకు కూలి పెంచాలని రేషన్ గోడౌన్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక పౌరసరఫరాల సంస్థ గౌడన్ వద్ద బుధవారం ఎపి రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ వర్కర్ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ గౌడన్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులు కళ్లకు నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 2024 జనవరి నుండి కూలి రేట్ల అగ్రిమెంట్ పెంపుదల ప్రకారం పెంచి అమలు చేయాల్సిన సివిల్ సప్లయ్ యాజమాన్యం నిర్లక్ష్యంగా ఉందన్నారు. 9 నెలలు అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎలాంటి జీవో విడుదల చేయకుండా కాలయాపన చేయడం శోచనీయమన్నారు. వెంటనే కూలి రేట్లను పెంపుదల చేసి అరియర్స్‌తో కలిపి జివో విడుదల చేయాలని కోరారు. రూట్ ఆప్టిమేషన్ రద్దు చేయాలన్నారు. ప్రతి నెల 10లోపు కూలి బిల్లులు చెల్లించాలని కోరారు. బోనస్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల్ని పరిష్కరించకపోతే దశల వారీ ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, ఓబులేసు, శివ, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

రబీలో విత్తనశుద్ధి ఆచరించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రబీ పంటల సాగులో రైతులు విత్తనశుద్ధి పద్ధతులు తప్పక ఆచరించాలని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. ఉప్పలూరులో బుధవారం సర్పంచ్ పల్లా గంగయ్య ఆధ్వర్యంలో ఎఒ పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ పాడిపశువుల పెంపకంలో మెలకువలు, ముర్రుపాల ఆవశ్యకత, పాడిపశువుల్లో సంభవించే వ్యాధులు.. వాటి నివారణ పద్ధతుల గురించి రైతులకు వివరించారు. ఏపీఎంఐపీ ఎంఐ ఏఒ యేసు నాథరెడ్డి మాట్లాడుతూ డ్రిప్, సూక్ష్మ సేద్య పరికరాల రాయితీ వివరాలను తెలిపారు. కావలసిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

పులివెందుల టౌన్ : రసాయన మందులు లేకుండా పంటలు పండించాలని వ్యవసాయ అధికారి నాగలక్ష్మి సూచించారు. పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో ఎఒ నాగలక్ష్మి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. పంటలను పరిశీలించి ఇందులో ముడత ఉండడం గుర్తించామన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారి నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబహానిబీ పాల్గొన్నారు.

చాపాడు : వరి పంటలో నూతన యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె, కేతవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం మండల వ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారన్నారు. వరి నాట్లు వేసే సందర్భంలో కాలిబాటలు తప్పక వదలాలన్నారు. యూరియాను అవసరం మేరకే వినియోగించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గురివి రెడ్డి, టిడిపి నాయకులు నారపరెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, వీరారెడ్డి, విఏఏలు, రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముద్దనూరు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్యకోరారు. మండలంలోని పైడిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు నిరంతరం వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉంటూ వారి అభ్యున్నతికి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఒ శివ మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది దీపిక, రైతులు పాల్గొన్నారు.

చక్రాయపేట : భవిష్యత్ సేంద్రియ వ్యవసాయానిదేనని అధికారులు పేర్కొన్నారు. మండలంలోని బాల తిమ్మయ్యగారిపల్లెలో వ్యవసాయ, దాని అనుబంధ శాఖలు రైతులతో సమావేశం నిర్వహించాయి. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల ప్రకృతి కాలుష్యం అవుతుందన్నారు. ఖర్చు ఎక్కువవుతుందని, దిగుబడిలో నాణ్యత లోపిస్తుందని తెలిపారు. భావి తరాలకు మంచి నేల, మంచి ఆహారం అందించాలంటే, ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయంపైన అవగాహన పెంచుకోవాలన్నారు. ఘన, ద్రవ జీవామృతం తయారు చేయడం వంటి అంశాలను వివరించి, రైతుల వద్దే వాటిని తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో ఎఒ నవంత్‌బాబు, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

వేముల : పొలాల క్షేత్ర సందర్శనతోపాటు వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎఒ చెన్నారెడ్డి పేర్కొన్నారు. వ్యవసాయ అధికారులు స్థానిక రైతులతో కలిసి పొలాల క్షేత్ర సందర్శన అనంతరం గ్రామస్తులతో నల్లచెరువుపల్లి రైతు సేవా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. గ్రామంలో 1002 మంది రైతులు 3,212 ఎకరాల్లో పంటలు వేశారని అన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జీవామృతం తయారీ విధానాన్ని డెమో ద్వారా రైతులకు వివరించారు.

ఖాజీపేట : వ్యవసాయంలో సేంద్రియ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎఒ నాగార్జున అన్నారు. పుల్లూరు రైతు సేవా కేంద్రం, ఖాజీపేట రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సిరి కల్చర్ అసిస్టెంట్ గురప్ప, సిబ్బంది సాయితేజ, ప్రశాంత్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సిడిపిఒ శ్రీదేవి సూచించారు. మండలంలోని త్రిపురవరం గ్రామ సచివాలయం పరిధిలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా బుధవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు రమాదేవి, భారతి, శ్రీదేవి, సిబ్బంది పావని, చెన్నమ్మ పాల్గొన్నారు.

సింహాద్రిపురం : గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంత పేర్కొన్నారు. సింహాద్రిపురం ఏడవ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాలు బాగా తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జయప్రకాశ్, విజయలక్ష్మీ, నాగలక్ష్మీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, తల్లులు పాల్గొన్నారు.

చక్రాయపేట : మండలంలోని ఎర్రగుడి పంచాయితీలోని బిఎన్ తండా అంగనవాడీ కేంద్రంలో పిల్లల పౌష్టికాహారంపై బుధవారం అవగాహన కల్పించారు. కుప్పం సెక్టార్ సూపర్‌వైజర్ సుభద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలింతలు, గర్భిణులు, పిల్లలు రక్త హీనతబారిన పడకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎర్రగుడి, బిఎన్ తండా, ముద్దప్పగారి పల్లె అంగనవాడీ వర్కర్లు ధనలక్ష్మి, అరుణ కుమారి, హైమావతి పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

దసరాను ఘనంగా నిర్వహిస్తాం

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

దసరా పండుగను ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తామని మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి శివ వెంకట ప్రసాద్ తెలిపారు. ఆ మేరకు బుధవారం అమ్మవారి శాలలో ఆయన దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం సూరిశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ ఈసారి దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

సింహాద్రిపురం : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఆశాఖ ఇంజనీరు దినేష్‌కుమార్ పేర్కొన్నారు. సింహాద్రిపురం విద్యుత్ శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన ఎస్ఇగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఇ మాట్లాడుతూ రైతులకు కోతలులేని విద్యుత్ అందించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం రైల్వేకోడూరుకు బదిలీపై వెళ్తున్న ఎఇ సుబ్రమణ్యంను ఘనంగా సన్మానించారు. ముందుగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడలకు శ్రీచైతన్య విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి చెప్పారు. నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారని పేర్కొన్నారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సోమా సుందర్, కృష్ణప్రసాద్‌ను కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అభినం దించారు. విద్యార్థులు చదువుతోపాటు అయా రంగాల్లో రాణించాలని కోరారు.

అనుమానాస్పదంగా సంచరిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

అనుమానాస్పద స్థితిలో ఎవరైనా రాత్రి సమయాల్లో సంచరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుని, కేసు నమోదు చేస్తామని సిఐ జీవన్ గంగానాథ్ బాబు హెచ్చరించారు. పులివెందుల ప్రాంతంలో వరుసగా చోరీలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని నివారణ చర్యలో భాగంగా బుధవారం ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 64 మంది ఈ ప్రాంతంలో వివిధ రకాలైన పనులు చేస్తున్నారన్నారు. వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చోరీలకు పాల్పడిన వారిని కూడా తొందరలోనే పట్టుకొని వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. పట్టణ ప్రజలు కూడా పోలీసులకు సహకరించి, చోరీలు అరికట్టేందుకు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ పాల్గొన్నారు.


రాష్ట్రేతరులకు కౌన్సెలింగ్ చేస్తున్న సిఐ


ప్రశ్నపత్రాలను విడుదల చేస్తున్న జెవివి నాయకులు, ఉపాధ్యాయులు

చెకుముకి సంబరాలు విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో జరిగిన చెకుముకి స్కూల్ స్థాయి సంబరాలు విజయవంతమైనట్లు జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తవ్వా సురేష్, ప్రధానోపాధ్యాయులు గుర్రప్ప తెలిపారు. బుధవారం వారు ప్రశ్న పత్రాలను విడుదల చేశారు. పిల్లల్లో సైన్స్ పట్ల అభిరుచి, స్వతంత్ర్య ఆలోచన, సృజనాత్మకతను పెంచడానికి తోడ్పడేలా ఈ సంబరాలు జరుగు తాయని తెలిపారు. ప్రొద్దుటూరులోని అన్ని పాఠశాలల్లో 7,500 మంది విద్యా ర్థులు ఈ సంబరాల్లో పాల్గొన్నారని తెలిపారు. పాఠశాల స్థాయిలో విజే తలుగా నిలిచినవారికి మండలస్థాయిలో అక్టోబర్1న శ్రీ తొగట వీరక్షత్రియ కల్యాణ మండపంలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యా యులు చెన్నప్ప, వినోద్‌కుమార్, నరసింహులు, తిరుమలదేవి, స్వర్ణలత పాల్గొన్నారు.

సాంకేతికంగా నైపుణ్యాభివృద్ధి చెందాలి

ముద్దనూరు : విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగంలో నైపుణ్యాభివృద్ధి చెందాలని ఎంఇఒ సుబ్బారావు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి సైన్సు సంబరాల పరీక్ష నిర్వహించారు. వంద మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌లో మంచి ప్రతిభ చూపాలన్నారు. సైన్స్ పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు కడపలో 'ఏచూరి' సంస్మరణ సభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఈనెల 27న ఉదయం కడప ప్రెస్‌క్లబ్‌లో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఆ మేరకు బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరితో చిత్రపటంతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. కడపలో జరిగే ఏచూరి సంస్మరణ సభకు రాజకీయ నాయకులు, మేధావులు, ముఖ్యులు హాజరవుతున్నారన్నారు. వామపక్ష భావాలున్నవారు, సమాజ మార్పు కోరుకునేవారు ఈ సంస్మరణ సభలో పాల్గొని ఆయనకు నివాళులర్పించాలని సత్యనారాయణ కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు విజయ్, పక్కీరయ్య, బాలసుబ్బయ్య, సిపియం శాఖ కార్యదర్శులు శేఖర్, శీను, బహబూబాబాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'పుట్టా'కు ఆహ్వానం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రుల కార్యక్రమాలకు రావాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు సుంకు సత్యనారాయణ శ్రేష్టి మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఆహ్వానించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నివాసంలో బుధవారం ఆయనను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

టిడిపి హయాంలో అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యమని ఆ పార్టీ మండల పరిశీలకుడు మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. మండలంలోని కసనూరులో బుధవారం ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం సర్పంచ్ రవణమ్మ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ససన్న, ఎంపీడీవో కృష్ణమూర్తి, పిఆర్ ఎఇ ఉదయ్‌కుమార్ రెడ్డి, ఎపిఒ జయభారతి, పంచాయతీ సెక్రెటరీ అరుణ్ పాల్గొన్నారు.

చాపాడు : మండలంలోని రాజువారిపేట, సీతారామపురం గ్రామాల్లో అధికారులు, టిడిపి నాయకులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వందరోజుల పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. టిడిపి నాయకులు వెన్నపూస కిషోర్‌రెడ్డి, కొత్తపల్లె వీరారెడ్డి, మోహన్‌రెడ్డి, ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి, ఏపిఎం వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొండాపురం : కొండాపురం సచివాలయం వద్ద ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష రెడ్డి, మండల ఎన్‌డిఎ కూటమి ఇన్‌ఛార్జి శివనారాయణరెడ్డి, ఎంపీడీవో నాగప్రసాద్, ఎంపీటీసీ సుకన్య విశ్వనాథరెడ్డి, సూపర్ మార్కెట్ విష్ణు వర్ధన్ రెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, బుజ్జి, కోడూరు జగదేకరెడ్డి, పవన్‌రెడ్డి, రేగడిపల్లి మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అరాచకం, విధ్వంసం రాజ్యమేలాయని పేర్కొన్నారు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు దూసుకెళుతోందన్నారు. ఆరు నెలల్లో 'సూపర్ సిక్స్' పథకాలన్నీ అమలు చేస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర కల్లుగీత కార్మిక డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, అడ్వకేట్ రామదాసు, ఒంటిమిట్ట యువ నాయకులు హరినాథ్ రెడ్డి, ఒంటిమిట్ట శివారెడ్డి, మోదుగుల నరసింహులు, ఈశ్వరయ్య, డాక్టర్ శివ, గురయ్య, బాల మునెయ్య, భాకరాపేట సర్పంచ్ ప్రతాప్, బొడ్డే రమణా నాయుడు, చౌడయ్య, శరత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మౌలాలి, సుంకేసుల చౌడయ్య, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వేముల : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను కులమత బేధం లేకుండా అందిస్తామని టిడిపి నాయకులు పేర్ల పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. వేముల, గొందిపల్లి, కొత్తపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి పరిష్కారానికి చొరవ చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకాంత్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, తహశీల్దార్ ఇందిరా రాణి, కునపూరి రాములు, పేర్ల సత్యమారెడ్డి, ఓబుల్‌రెడ్డి యాదవ్, షాలీమ్‌ఖాన్, పెద్దజుటూరు బాషా, కునపూరి నాగేంద్ర, వల్లెపు వెంకటేష్, ఆసం విశ్వేశ్వర్‌రెడ్డి, నాగేశ్వరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్న పాఠశాల భవనాలు

- టిడిపి నేత జయచంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైసిపి ప్రభుత్వ పాలనలో కోట్లాది రూపాయలతో నిర్మించిన బాలుర పాఠశాల భవనాలు చిన్నపాటి వర్షానికే గోడలు నెమ్ము ఎక్కుతున్నట్లు దేవస్థానం మాజీ చైర్మన్, టిడిపినేత సింగారెడ్డి జయచంద్రారెడ్డి ఆరోపించారు. నెమ్ము ఎక్కిన బాలుర పాఠశాల భవనాలను బుధవారం జయచంద్రారెడ్డి, రెడ్డి కిషోర్, సాయిరెడ్డి, ప్రసాద్ పరిశీలించారు. వాటర్ ప్లాంట్‌ను పరిశీలించి ప్రధానోపాధ్యాయురాలు శివ మునెమ్మను తాగునీటిపై అడిగి తెలుసుకున్నారు. పని చేయని వాటర్ ప్లాంట్‌ను మెకానిక్‌ని పిలిపించి చెక్ చేయించారు.

ఎఒగా పరిపూర్ణ అరుంధతి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - ముద్దనూరు

ఎంపిడిఒ కార్యాలయ పరిపాలనాధికారిగా బుధవారం పరిపూర్ణ అరుంధతి బాధ్యతలు చేపట్టారు. పెద్దముడియం ఎఒగా విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ముద్దనూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాన్ని ప్రగతి పథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు. సచివాలయం ఉద్యోగులు ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. గ్రామ, ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పరిపూర్ణ అరుంధతి పేర్కొన్నారు.

అనాథ వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక నాగమ్మ నగర్‌లో ఉన్న అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం టిడిపి నేత, దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు తన కుమారుడు కొండ్రాయుడు మొదటి వర్ధంతిని పురస్కరించుకుని అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. ప్రతి ఎడాది తన కుమారుడు పేరు మీద అనాథ వృద్ధులకు అన్నదానం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వృద్ధాశ్రమానికి తనవంతు ఆర్థికసాయం కూడ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.